క్లుప్తంగా

బాధిత మహిళలకు అండగా 'సఖి'



కాజీపేట అర్బన్: బాధిత మహిళలు, బాలికలకు సఖి వన్‌స్టాప్ సెంటర్ అండగా నిలుస్తోందని సఖి వన్‌స్టాప్ సెంటర్ లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి, కేస్ వర్కర్ వినీల తెలిపారు. హంటర్ రోడ్డులోని రోహిణి నర్సింగ్ కళాశాలలో సఖి వన్‌స్టాప్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. గృహహింస, లైంగిక వేధింపులు, అత్యాచారాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళలు.. సఖి సెంటర్‌ను సంప్రదించి సత్వర రక్షణ పొందాలని సూచించారు. బాధితులు 181 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. బాధిత మహిళలకు తాత్కాలిక వసతి, వైద్య, న్యాయ, పోలీస్ సహాయం, కౌన్సెలింగ్ సహాయం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చైతన్య, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

చర్మ పరిశ్రమల భూములను పరిరక్షించాలి



హన్మకొండ: చర్మ పరిశ్రమల భూములను పరిరక్షించాలని తెలంగాణ చర్మకారుల పరిశ్రమల భూముల పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు కూసపాటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కులో సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లిడ్ క్యాపు భూములను ప్రభుత్వం కాపాడాలని సూచించారు. అదే విధంగా సంఘాన్ని బలోపేతం చేయాలని కోరారు. సమావేశంలో ఆర్‌పీఐ (బొజ్జా తారకం) రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య, తెలంగాణ చర్మకారుల పరిశ్రమల భూముల పరిరక్షణ సంఘం గడపాక భూమయ్య, ఇటికాల లత, భూమన్న, కూసపాటి శ్రీను, కోర్నేల్, నాగయ్య, ఎం.రాజు, జీ.కుమారస్వామి, జెన్న కొండయ్య, కే.కుమారస్వామి పాల్గొన్నారు.

నరకాసుర వధకు ఏర్పాట్లు చేయండి



వరంగల్ అర్బన్: దీపావళి పండుగ సందర్భంగా జరగనున్న నరకాసుర వధ ఉత్సవాలకు ఎన్నికల కోడ్‌కు లోబడి బల్దియా తరఫున ఏర్పాట్లు చేపట్టనున్నట్లు గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా తెలిపారు. ఈమేరకు కమిషనర్‌ను నరకాసుర వధ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి ఆధ్వర్యంలో బాధ్యులు శుక్రవారం కలిసి వేడుకలకు ఏర్పాట్లు చేయాలని కోరారు. కార్యక్రమంలో నరకాసుర వధ ఉత్సవ కమిటీ సభ్యులు కనుకుంట్ల రవి, ఆవునూరి రామ్మూర్తి, వనం కుమార్, మరుపల్ల గౌతమ్, మాటేటి శ్యామ్, వంగరి సురేష్, దూడ కొమురెల్లి, కుమారస్వామి, కుడికాల సాంబశివరావు, తవుటం నరసింహ, కొమ్ము రాజు తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం



కాశిబుగ్గ: రైల్‌లో నుంచి ప్రమాదవశాత్తు జారిపడి గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన నెక్కొండ – ఇంటికన్నె రైల్వే స్టేషన్ల మధ్య నెక్కొండ రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం జరిగింది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం మృతుడి వయస్సు 35 – 40 మధ్య ఉంటుందని, మృతదేహాన్ని ఎంజీఎం ఆస్పత్రి మార్చురీలో భద్రపరినట్లు చెప్పారు. వివరాలకు 94415 57232, 87126 58585 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్‌కే దివ్యాంగుల మద్దతు



నయీంనగర్: ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకే దివ్యాంగుల పూర్తి మద్దతు ఉంటుందని దివ్యాంగుల సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గౌని యాదగిరి తెలిపారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు రూ.4,016 పింఛన్ ఇచ్చి వారి జీవితాల్లో సీఎం కేసీఆర్ వెలుగులు నింపుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో దివ్యాంగుల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.మహబూబ్ అలీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ మదార్ పాషా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహేష్, రావుల వెంకట్‌రెడ్డి, మంజూర్ ఇలాహి, కొత్తపల్లి స్వామి, గోలి రాజయ్య పాల్గొన్నారు.

ఇక హోరెత్తనున్న ప్రచారం

- హస్తం పార్టీ అభ్యర్థుల ప్రకటనతో పొలిటికల్ హీట్
- బీఆర్‌ఎస్‌కు దీటుగా పర్యటనలు



సాక్షి, వరంగల్ : వరంగల్ జిల్లాలో ఇక రాజకీయం మరింత హీటెక్కనుంది. ఇప్పటికే సంకేతాలు అందిన నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థులు ప్రచారం ముమ్మరం చేశారు. వరంగల్ తూర్పులో కొండా సురేఖ, వర్ధన్నపేటలో కేఆర్ నాగరాజు, పరకాలలో రేవూరి ప్రకాష్‌రెడ్డి, పాలకుర్తి నుంచి యశస్విని మామిడాల అభ్యర్థిత్వాలను కాంగ్రెస్ అధిష్టానం శుక్రవారం ఖరారు చేయడంతో హస్తం శ్రేణుల్లో జోష్ నెలకొంది. ఇదివరకే నర్సంపేట నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా దొంతి మాధవరెడ్డి పేరు తొలి జాబితాలోనే ఖరారైంది. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తున్న నేతలు.. ఇక అభ్యర్థులు తమ ప్రచారంలోనూ వీటిని ప్రధానంగా ప్రస్తావిస్తూ, అధికార పార్టీ నేతల ఆగడాలను కూడా కౌంటర్ చేస్తూ ముందుకెళ్లేలా కార్యాచరణ రూపొందించుకుంటున్నారు. అభ్యర్థుల ప్రకటనతో మాత్రం కాంగ్రెస్ కార్యకర్తల్లో ఆనందం వెల్లివిరిస్తోంది. మీ అభ్యర్థులెక్కడా అని నిలదీసిన ఇతర పార్టీలనే లక్ష్యంగా చేసుకొని ముందుకెళ్లనున్నారు. అదే సమయంలో ఆయా నియోజకవర్గాల నుంచి టికెట్ ఆశించి భంగపడిన ఇతర నాయకులను కూడా కలుపుకొని ముందుకెళ్లేలా ఓ అవగాహనకు వచ్చారని, అంతా ఓకే అనుకున్నాకే జాబితా బయటకు వచ్చిందని పార్టీల్లో చర్చ జరుగుతోంది. పార్టీ గెలుపు కోసం పనిచేసే వారికి భవిష్యత్‌లో మంచి స్థానం కల్పిస్తామని ఇప్పటికే హామీ రావడంతో పెద్దగా అసంతృప్తి ఉండకపోవచ్చని తెలుస్తోంది. ఇదంతా కాంగ్రెస్ పార్టీలోనే అంతర్గత విషయం ఒక ఎత్తయితే.. ఇక అధికార బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులు ఇన్నాళ్లు చేసిన అవినీతిఅక్రమాలను ఎండగడుతూ ముచ్చెమటలు పట్టిస్తూ ఎన్నికల ప్రచారాన్ని మరింత వేడెక్కించడం మాత్రం ఖాయంగా కనిపిస్తోంది. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి దయాకర్‌రావు నియోజకవర్గమైన పాలకుర్తి నుంచి ఇన్నాళ్లు పేరు వినిపించిన హనుమాండ్ల ఝాన్సీరెడ్డి స్థానంలో ఆమె సూచన మేరకు కోడలు యశస్విని మామిడాలకు అవకాశం కల్పించారు. ఇప్పటికే ఝాన్సీరెడ్డి పాలకుర్తి నియోజకవర్గంలోని వరంగల్ జిల్లాకు వచ్చే రాయపర్తి మండలంతోపాటు అన్ని ప్రాంతాల్లో ఓ విడత ప్రచారం చేశారు. యశస్వినికి టికెట్ ఇవ్వడంతో మరి రాజకీయం ఇంతకు ముందు ఉన్నంత హాట్‌గా ఉంటుందా లేదా అన్న చర్చ పొలిటికల్ సర్కిల్‌లో జరుగుతోంది.

గులాబీ జెండాను ఎగురవేస్తాం..



మేనిఫెస్టో ప్రతులను అందజేస్తున్న వినయ్‌భాస్కర్

హన్మకొండ: వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 9, 10వ డివిజన్లలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌తో కలిసి బీఆర్‌ఎస్ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్ శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ప్రజా ఆశీర్వాదంతో మరోసారి వరంగల్ పశ్చిమలో గులాబీ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ సుందర్ రాజ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, కార్పొరేటర్ చీకటి శారద పాల్గొన్నారు.

వినయ్‌భాస్కర్ గెలుపు ఖాయం

హన్మకొండ: వినయ్‌భాస్కర్ విజయం సాధిస్తారని భారత జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్ ధీమా వ్యక్తం చేశారు. గోకుల్ కూడలి నుంచి వడ్డెపల్లి చర్చి కూడలి వరకు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇమ్మడి లోహిత రాజు, బీఆర్‌ఎస్ 58వ డివిజన్ అధ్యక్షుడు కందేరావు నర్సింహారావు, 59వ డివిజన్ అధ్యక్షుడు నీలం సుహస్ పాల్గొన్నారు.

రైల్వే పెన్షనర్ల మద్దతు

కాజీపేట: వినయ్‌భాస్కర్‌ను కాజీపేట రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు కలిసి తమ మద్దతు ప్రకటించారు.

బీఆర్‌ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం

కాజీపేట రూరల్: కార్పొరేటర్ సంకు నర్సింగరావు ఆధ్వర్యంలో బాపూజీనగర్‌లో బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు.

సీపీఎం నాయకులపై దాడి హేయం

వరంగల్: వరంగల్ నగరంలోని జక్కలొద్ది భూపోరాట కేంద్రాన్ని సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం సందర్శించడానికి వెళ్లగా పార్టీ నాయకులపై బీఆర్‌ఎస్ తొత్తులుగా వ్యవహరిస్తున్న రామ సందీప్, కొత్తూరు అనిల్, శ్యామ్, రాకేశ్, పూర్ణచందర్, సతీష్‌తోపాటు మరికొంత మంది నాయకులు దుర్భాషలాడుతూ కొట్టడం చాలా హీనమైన చర్య అని సీపీఎం రాష్ట్ర నాయకుడు జగదీశ్ విమర్శించారు. ఈమేరకు సంఘటన స్థలం వద్ద శుక్రవారం ఆయన మాట్లాడుతూ అమాయకులైన ప్రజలను ప్రలోభాలతో లొంగదీసుకుని భయభ్రాంతులకు గురి చేస్తూ, ప్రజల కోసం పోరాడుతున్న సీపీఎం జిల్లా నాయకుడు మాలోత్‌సాగర్, రంగశాయిపేట ఏరియా నాయకులు ప్రత్యూష, మహమ్మద్, జమీల్ తదితరులపై బీఆర్‌ఎస్ నాయకులు దాడి చేయడం శోచనీయమని అన్నారు. సీపీఎం ఎదుగుదలను చూసి ఓర్వలేని స్థానిక తూర్పు నియోజకవర్గ అభ్యర్థి నన్నపునేని నరేందర్.. విచ్ఛిన్నకర శక్తులను చేరదీసి సీపీఎం నాయకుల మీదికి దాడికి ఉసిగొలుప్పతున్నారని వాపోయారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సింగారపు బాబు, ముక్కెర రామస్వామి, నాయకులు అరూరి కుమార్, అక్కెనపల్లి యాదగిరి, వలదాసు దుర్గయ్య, నాయకులు సాంబమూర్తి, జ్యోతిరత్నం, ఓదెలు, దాసు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు చుక్కా ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయాల ఏర్పాట్లు



కాజీపేట: వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఎన్నికల వాతావరణం రోజురోజుకు వేడెక్కుతోంది. పూర్తి స్థాయిలో రాజకీయ పార్టీల అభ్యర్థుల పేర్లు పూర్తి స్థాయిలో ఖరారు కానప్పటికీ ఎన్నికల ప్రచారపర్వం ఊపందుకోవడంతో అభ్యర్థులు ఆయా డివిజన్లలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఓ వైపు అసమ్మతి వాదులను బుజ్జగిస్తూనే మరోవైపు కార్యకర్తల కోసం కార్యాలయాల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే పలువురు తమ పార్టీ ప్రచార కార్యాలయాలను ఏర్పాటు చేసుకోగా, మరికొందరు వాటి ఏర్పాట్లపై దృష్టి సారించారు. ఖాళీ షట్టర్లలో కార్యాలయాలను ఏర్పాటు చేయటం, అవి అందుబాటులో లేకుంటే ఖాళీ ప్రాంతాల్లో తడకలు, కవర్లతో తాత్కాలిక షెడ్లు తయారు చేస్తున్నారు. ఎలక్షన్ సమీపిస్తుండడంతో అభ్యర్థుల ఇళ్ల వద్ద ఉదయం నుంచే సందడి వాతావరణం నెలకొంటోంది. ప్రచారం అనంతరం కార్యకర్తలు పార్టీ కార్యాలయాల్లో సేద తీరుతున్నారు. కార్యకర్తలకు కావాల్సిన కనీస సౌకర్యాలను అభ్యర్థులు సమకూర్చుతూ ముందుకు సాగుతున్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి



ప్రచారంలో భాగంగా నాన్యతండాలో దుస్తులను ఇస్త్రీ చేస్తున్న రాజేందర్ రెడ్డి

కాజీపేట: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజల కన్నీళ్లు, కష్టాలు తొలగిపోతాయని, అభివృద్ధి సాధ్యమవుతుందని హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. కాజీపేట 61వ డివిజన్ నాన్యతండా, సిద్ధార్థనగర్, ప్రశాంత్‌నగర్ వంటి పలు కాలనీల్లో కార్యకర్తలతో కలిసి శుక్రవారం పాదయాత్ర చేస్తూ ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లను కలుస్తూ చేతి గుర్తుకు ఓటేయాలని నాయిని అభ్యర్థించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ప్రజలు గెలిపించి తెలంగాణ రాష్ట్రాన్నిచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకోవాలని సూచించారు. ప్రచారంలో కార్పొరేటర్ పోతుల శ్రీమాన్, డివిజన్ అధ్యక్షుడు గజపాక రమేష్, నాయకులు గొట్టిముక్కుల రత్నాకర్ రెడ్డి, రమాకాంత్ రెడ్డి, బంక సరళ, అంకూస్, గౌస్ పాల్గొన్నారు.

రేపు గోర్ బంజారా జాతీయ సమావేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నయీంనగర్: ఈనెల 29న హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో సాయంత్రం 4గంటల నుంచి జరగనున్న రాష్ట్రీయ ఘుమంతు జన్ జాతి మోర్చా, రాష్ట్రీయ గోర్ బంజారా క్రాంతి సంఘ్, మౌర్య క్రాంతి సంఘ్‌ల రెండవ జాతీయ సంయుక్త సమావేశాలను విజయవంతం చేయాలని లంబాడ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) జాతీయ అధ్యక్షుడు దాస్‌రాం నాయక్, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్, రాష్ట్రీయ గోర్ బంజారా క్రాంతి సంఘ్ రాష్ట్ర ఇన్‌చార్జ్ డాక్టర్ నరేందర్ పవార్ కోరారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశాల్లో వారు మాట్లాడుతూ ఈ సమావేశాలకు ఢిల్లీ నుంచి భారత ముక్తి మోర్చా జాతీయ అధ్యక్షుడు వామన్ మేశ్రామ్ అధ్యక్షత వహిస్తారని, దేశంలోని 31 రాష్ట్రాలకు చెందిన 198 సంచార జాతుల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ నాయక్, ఉపాధ్యక్షుడు భద్రు నాయక్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనునాయక్, గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు సాయం సత్యనారాయణ, తుడుందెబ్బ రాష్ట్ర నాయకుడు కొమురం బుచ్చయ్య దొర, తదితరులు పాల్గొన్నారు.

సభకు తరలిన నాయకులు



మడికొండ: కాజీపేట మండలం భట్టుపల్లి గ్రామంలో వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభకు గ్రేటర్ వరంగల్ పరిధిలోని 46, 64వ డివిజన్ల నుంచి కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వాహన ర్యాలీని కార్పొరేటర్లు మునిగాల సరోజన, ఆవాల రాధికరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు బొల్లికొండ వినోద్‌కుమార్ గౌడ్, దువ్వ శ్రీకాంత్, గ్రామశాఖ అధ్యక్షులు వెన్నమల్ల రమేష్, వల్లెపు ఉపేందర్, గాండ్ల భిక్షపతి, పల్లపు రాజేందర్, అనిల్, కుమార్ బాబు, కుమార్‌రాజా, దశరథం, బండారి మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే సంక్షేమం



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న రావు పద్మ

కాజీపేట: రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని వరంగల్ పశ్చిమ బీజేపీ అభ్యర్థి రావు పద్మ అన్నారు. కాజీపేట 62వ డివిజన్ సోమిడిలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర మాజీ మేయర్ డాక్టర్ టీ.రాజేశ్వర్ రావు, కోరబోయిన సాంబయ్య, దొంతి దేవేందర్ రెడ్డి, చిర్ర నర్సింగ్ గౌడ్, భగవాన్ దాస్ ఉపాధ్యాయ, కాయిత రాజ్‌కుమార్ యాదవ్, పెసరు తిలక్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా సీబీసీ ఎన్నికలు



ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఓటర్లు

కాశిబుగ్గ: వరంగల్ క్రిస్టియన్ కాలనీ సెంటినరీ బాప్టిస్టు చర్చి (సీబీసీ) నూతన పాలకవర్గ ఎన్నికలు చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిశాయి. శుక్రవారం ఉదయం 8గంటలకు ప్రారంభమైన పోలింగ్.. సాయంత్రం 5గంటల వరకు కొనసాగింది. మొత్తం 2,121 ఓట్లకు గాను 1,483మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని పోలింగ్ అధికారులు తెలిపారు. శనివారం ఉదయం10 గంటల నుంచి ఓట్ల లెక్కింపు కొనసాగుతుందని చెప్పారు. చర్చి పాలకవర్గ ఎన్నికల్లో అధ్యక్ష పదవికి పీఆర్ సాల్మన్, పోలెపాక జాయ్ మనోజ్‌కుమార్, పోలెపాక మనోహర్, పోలెపాక రాజు, పోలెపాక ఆరోన్ పోటీ చేశారు. గెలుపొందిన వారు చర్చి పాలకవర్గ సభ్యులుగా రెండేళ్లపాటు కొనసాగుతారు. మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ సురేష్, ఎస్సై రాజు ఆధ్వర్యంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భద్రతా చర్యలు చేపట్టారు.

గెలుపునకు సమష్టిగా కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజేశ్వర్ రావు

ఖిలా వరంగల్: బీజేపీతోనే తూర్పు నియోజవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని నగర మాజీ మేయర్ డాక్టర్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. తూర్పు నేతలు, కార్యకర్తలు సమష్టిగా పనిచేస్తూ ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావును గెలుపు కోసం పనిచేయాలని సూచించారు. వరంగల్ రైల్వే గేట్ శాంతినగర్‌లోని రాజశ్రీగార్డెన్‌లో ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం జరిగింది. ముఖ్యఅతిథిగా రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులకు దీటుగా నిలబడి వారిని ఎదుర్కొని ఎన్నికల్లో గెలిచే సత్తా ప్రదీప్‌రావుకు ఉందన్నారు. అనంతరం ప్రదీప్‌రావు మాట్లాడుతూ ప్రజలు ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. మాజీ మంత్రి పొన్ను రాధాకృష్ణన్, ఇన్‌చార్జ్ కోటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే శ్రీరాములు, నరహరి వేణుగోపాల్‌రెడ్డి రాజయ్యయాదవ్, కుసుమ సతీష్, వంగాల సమ్మిరెడ్డి, అశోక్‌రెడ్డి, గంట రవి, వెంకటరమణ, పరమేశ్వర్, శ్రీనివాస్, హరిశంకర్ పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న వేణుగోపాల్ రెడ్డి

ఖిలా వరంగల్: ద్విచక్ర వాహనం నడిపే ప్రతిఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కమాండెంట్ శివప్రసాద్ రెడ్డి సూచించారు. పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా మామునూరు టీఎస్‌ఎస్పీ బెటాలియన్ ప్రాంగణంలో అసిస్టెంట్ కమాండెంట్లు రాంబాబు, వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో హెల్మెట్ ధారణపై శుక్రవారం అవగాహన బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించి శివప్రసాద్ రెడ్డి మాట్లాడారు. శరీరంలో తల ఎంతో సున్నితమైందని, ఈక్రమంలో రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయాలు కావడంతో చాలామంది మృతి చెందుతున్నారని వివరించారు. అనంతరం బెటాలియన్ ప్రాంగణం నుంచి పెన్షన్‌పురం, లక్ష్మిపురం మీదుగా మామునూరు వరకు బైక్ ర్యాలీ నిర్వహించి హెల్మెట్ ఆవశ్యకతను వాహనదారులకు వివరించారు. కార్యక్రమంలో అధికారులు, ఆర్‌ఐ కార్తీక్, వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టళ్ల డిపాజిట్లు తగ్గించాలి



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో వివిధ కోర్సుల్లో ప్రవేశాలు పొంది హాస్టల్‌లో ప్రవేశాలు పొందుతున్న విద్యార్థులకు డిపాజిట్‌ను పెంచడం సరికాదని, దాన్ని తగ్గించాలని కేయూ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు సుదగాని మధుగౌడ్, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కేయూ హాస్టళ్ల డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకయ్యకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరం కంటే ఈసారి హాస్టళ్ల డిపాజిట్ రేట్లను రెట్టింపు చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. దాంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులపై అదనపు భారం పడుతోందని వాపోయారు.

బీఆర్‌ఎస్‌ను చిత్తుగా ఓడించాలి



మాట్లాడుతున్న సయ్యద్ వలీఉల్లాఖాద్రీ

ఖిలా వరంగల్: యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించలేని బీఆర్‌ఎస్ పార్టీని ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలీఉల్లాఖాద్రీ పిలుపునిచ్చారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఎం తమ్మెర భవనంలో ల్యాదల్ల శరత్ అధ్యక్షతన ఏఐవైఎఫ్ జిల్లా మహాసభ శుక్రవారం జరిగింది. ముఖ్యఅతిథిగా వలీఉల్లా ఖాద్రీ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మాట తప్పిందని విమర్శించారు. రాష్ట్రంలో యువతకు ఉపాధి కల్పించడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని అన్నారు. ఈనెల 29, 30వ తేదీల్లో జరగనున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో దండు లక్ష్మణ్, ఏఐవైఎఫ్ నేతలు ఫయాజ్, జగదీష్, భరత్, బత్తుల సుప్రియ, చంద్రశేఖర్, రాజు, భాస్కర్, అశోక్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్రామ దేవతలకు పూజలు



పూజలు చేస్తున్న వేద పండితులు, భక్తులు

ఖిలా వరంగల్: వరంగల్ ఫోర్ట్ రోడ్డులోని రుద్రమాంబనగర్‌లో శుక్రవారం ఉదయం బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా బొడ్రాయి ఉత్సవ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో వేద పండితులు భాస్కరాచార్యులు, రుత్వికులు నేతృత్వంలో భక్తి శ్రద్ధలతో గ్రామ దేవతలకు పూజలు చేశారు. అధిక సంఖ్యలో ప్రజలు తరలిరాగా, వేదపండితులు వేద మంత్రోచ్ఛరణల మధ్య బొడ్రాయిని (గ్రామ దేవతలు) ప్రతిష్ఠించారు. గణపతి పూజ, ప్రాత రౌపాసనం, స్థాపిత దేవతాయజనం, వాస్తు పర్యగ్నీకరణ, గర్త న్యాసం, నవరత్న న్యాసనాలు, మంగళ వాయిద్యాల మధ్య యంత్ర, విగ్రహ స్థాపన జరిగాయి. అనంతరం విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ కుంభం, దృష్టి స్థాపన గోదర్శనం, జయాదయ పూర్ణాహుతి నిర్వహించారు. రాత్రి 10గంటల నుంచి శనివారం తెల్లవారుజామున 3గంటల వరకు అష్టదిగ్బంధనం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

శాయంపేట : మొక్కల పెంపకంతోనే పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని అడిషనల్ డీఆర్‌డీఓ శ్రీనివాసరావు అన్నారు. కొత్తగట్టు సింగారం, తహరాపూర్, శాయంపేట గ్రామాల్లోని నర్సరీలను శుక్రవారం ఆయన పరిశీలించారు. నర్సరీల్లో పూల, పండ్ల మొక్కలను పెంచాలన్నారు. మొక్కలు వాడిపోకుండా వాచర్‌తో నీటిని పట్టించాలని చెప్పారు.

బీసీలకు అవకాశాలు కల్పించని పార్టీలు



నిరసన తెలుపుతున్న సంఘం నాయకులు

వరంగల్: రాష్ట్రంలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు బీసీ కులాలకు టికెట్లు కేటాయించకుండా తీవ్ర అన్యాయం చేశాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుసుమ సతీష్‌బాబు ఆందోళన వ్యక్తం చేశారు. పద్మశాలి కులస్తులకు టిక్కెట్లు కేటాయించకపోవడంతో పద్మశాలి ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ వడ్నాల నరేందర్, కుసుమ సతీష్‌బాబు ఆధ్వర్యంలో వరంగల్ గోపాలస్వామి గుడి జంక్షన్‌లో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ బీసీలకు కుల ప్రాతిపదికన టికెట్లు కేటాయిస్తామని చెప్పిన అన్ని రాజకీయ పార్టీలు.. కేటాయించకుండా మోసం చేశాయని ఆరోపించారు. పద్మశాలి సంఘం నాయకులు శ్యాంసుందర్, మాచర్ల దీన్‌దయాళ్, చిలువేరు రాజేందర్, మాచర్ల చిన్నారావు, ఆడెపు నగేష్, దుస్సా శివ, కుసుమ శ్రీను, కోట సతీష్ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియపై అవగాహన అవసరం

వరంగల్ అర్బన్: ఎన్నికల ప్రక్రియపై రాజకీయ పక్షాలకు అవగాహన అవసరం అని వరంగల్ (తూర్పు) నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి, బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. శుక్రవారం 106– నియోజక వర్గానికి చెందిన పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల ప్రక్రియ, నామినేషన్ విధానం, సువిధ యాప్ ద్వారా ఫిర్యాదు, ఎన్నికల సరళిపై సమావేశమై తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌పై రాజకీయ పార్టీలకు అవగాహన ఉండాలన్నారు. నామినేషన్ ప్రక్రియపై ఏమైనా అనుమానాలు ఉంటే హెల్ప్‌డెస్క్ ద్వారా నివృత్తి చేసుకోవాలని చెప్పారు. సువిధ పోర్టల్ ద్వారా నామినేషన్ వేసుకోవచ్చని పేర్కొన్నారు. ఏసీ అనిసుర్ రషీద్, తహసీల్దార్ ఇక్బాల్, మాస్టర్ ట్రైనర్ సందీప్ కుమార్ పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న యువకుడు



మొబైల్ అందిస్తున్న శీలం రణం

హసన్‌పర్తి: ఏదైనా వస్తువు దొరికితే అది తన సొంతంగా భావించి వినియోగించుకునే ఈ రోజుల్లో ఓ యువకుడు తనకు దొరికిన ఓ మొబైల్‌ను బాధిత వ్యక్తికి అందించి నిజాయితీ చాటుకున్నాడు. హసన్‌పర్తికి చెందిన శీలం రణంకు రెండు రోజుల క్రితం హసన్‌పర్తిలో ఓ మొబైల్ ఫోన్ దొరికింది. ఆ ఫోన్ ఎవరిదని ఆరా తీయగా, ప్రేమ్ సమాజ్ అనే వలస కార్మికుడిగా గుర్తించాడు. ఈమేరకు బాధితుడికి శుక్రవారం ఫోన్‌ను రణం అందించాడు. కార్యక్రమంలో స్థానికులు బోయిని రమేష్, ఆరెల్లి వెంకటస్వామి, పెద్దమ్మ వంశీ, మేకల మైకేల్ పాల్గొన్నారు.